ప్రజాశక్తి

శనివారం 25 మే 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



కమ్మటి కథ చెబుతా వింటారా..

ప్రజాశక్తి-కోవూరు :పిల్లలు కథలు వినడం, చదవడం, చెప్పడం ద్వారా పదసంపద, పరిపూర్ణ వ్యక్తిత్వం, ప్రకృతిపై మమకారం ఏర్పడతాయని గ్రంథాలయ అధికారిణి కే.మంజులత అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరంలో కథలు పిల్లలపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్య కథలు వినడం ద్వారా ఆరోగ్యకర సమాజం ఒకప్పుడు ఉండేదని, నేటి ఆధునిక ప్రపంచంలో కథలు చెప్పేవారే కరువయ్యారని పేర్కొన్నారు. సెలవు దినాలలో పిల్లలకు ప్రతిరోజూ తల్లిదండ్రులు కథలు చెప్పడం, చదివించడం అలవాటు చేయాలన్నారు. కథల ద్వారా పిల్లలలో గ్రహణ శక్తి, జ్ఞాపకశక్తి, భావవ్యక్తీకరణ అంశాలలో ముందుంటారని తెలిపారు. ప్రతి ఇంట్లో కథల పుస్తకాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, గ్రంథ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి

ఇఎస్ఐ డిస్పెన్సరీకి రోగం..!

కార్మికులకు ప్రభుత్వ బీమా డిస్పెన్సరీ పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఎస్ఐ ఆసుపత్రులకు మాయ రోగం పట్టుకుంది..జిల్లాలోని వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాల నుంచి ఇఎస్ఐ పేరుతో ప్రతి నెలా నగదు తీసుకుంటున్నారు. వైద్య రంగం కార్పొరేట్ కరణ కావడంతో కార్మికులు వైద్యం, మందుల కోసం డిస్పెన్సరీకి వెళుతుంటారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, మందులు, వైద్యులను నియమించకుండా నిర్లక్ష్యం చేస్తుంది. ఉన్న వైద్యులన్నా సరిగా పనిచేస్తారంటే అది లేదు. తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తూ, ప్రయివేటు ప్రాక్టీస్ వైపు పరుగులు తీస్తున్నారు. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఇఎస్ఐ ఆస్పత్రులకు రోగులు వెళ్లడం లేదు. మందులు లేవు, పరీక్షలు లేవు. గతంలో బిపి, సుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలకు మందులు వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

◆మందులుండవ్..పరీక్షలుండవ్
◆భారీగా తగ్గిన రోగులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వం కార్మికులకు ఇఎస్ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేసింది. జిల్లాలో సుమారు 25 వేల మంది కార్మికులు వివిధ సంస్థల్లో పనిచేస్తున్నారు. కనీసవేతనం ఇవ్వాలని, ఆరోగ్యం, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని అనేక ఏళ్ళగా పోరాటం సాగిస్తున్నారు. జిల్లాలోని కార్మికులకు వైద్యసేవలు, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడానికి కోవూరు, ఏసి నగర్, స్టోన్ హౌస్‌పేటతో పాటు పలు ప్రాంతాల్లో ఆస్పత్రులు నడుస్తున్నాయి. ప్రతి నెల కార్మికులకు వచ్చే అతికొద్ది జీతం నుంచి ఇఎస్ఐ, పిఎఫ్ కట్‌చేసుకుంటున్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే, వైద్యం చేయించుకోవడం, ఏ కారణంచేతనైనా విధులకు హాజరుకాకపోవడం వైద్యుల అనుమతితో ఇఎస్ఐ ద్వారా జీతం అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇఎస్ఐ ఆసుపత్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. కోవూరులోని ఇఎస్ఐ ఏసి నగర్‌లోని డిస్పెన్సరీలో విలీనం చేశారు. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందికి ఇక్కడే పోస్టింగ్ ఇచ్చారు. గతంలో దీర్ఘకాలిక వ్యాధులు బిపి. సుగర్ వంటి రోగాలకు మందులు ఇచ్చేవారు. గతంలో ప్రతి రోజూ 150 మంది వరకు రోగులు వస్తుండగా, ప్రస్తుతం 30 మంది కూడా రావడం లేదు. కార్మికుని కుటుంబ సభ్యులకు కూడా ఇఎస్ఐ కార్డు వర్తిస్తుంది. వృద్ధులైన తల్లిదండ్రులు సుదూర ప్రాంతాల్లో ఉంటారు. ఎక్కువ మంది బిపి, సుగర్ వంటి దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతుండే వారు. వీరికి ప్రతి నెలా మందులు సరఫరా చేసేవారు. ఇప్పుడు ఆ రోగులు తీసుకొస్తేనే మందులు ఇస్తామని అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది మొండికేస్తున్నారు. వంద రూపాయల మందుల కోసం రెండు, మూడు వందలు ఖర్చుపెట్టి ఆటోల్లో రాలేక అనేక మంది ఆసుపత్రికి రావడం మానేశారు. కార్మికులకు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే 21 రోజులు మెడికల్ సెలవులు తీసుకుంటేనే అవకాశం ఉంది. ఇక్కడ పనిచేసే డాక్టరు పరీక్షించి సెలవు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ ఉన్న వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ వద్ద సర్టిఫికెట్ తీసుకొస్తేనే మంజూరు చేస్తామని పెండింగ్ పెడుతున్నారు. అనేక మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మందులు కూడా సక్రమంగా అందుబాటులో ఉండడం లేదు. ప్రభుత్వం నుంచి సరఫరాలో నిలిచిపోయి ఉండటం తెలుస్తోంది. ఒక్కసారి ఇచ్చిన మందులు మరో సారి ఇవ్వరు. బయట కొనుగోలు చేసుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నారు. అర్హతలేని వైద్య సిబ్బంది చేత మందులు సరఫరా చేయిస్తున్నారు. ఏ జబ్బుకు ఏ మందులు ఇవ్వాలన్నది కూడా తెలియని పరిస్థితి. మరీ దీన స్థితిలో ఉన్న కార్మికులు ఈ ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం..!

నగరంలోని ఏసి నగర్‌లోని ఇఎస్ఐ ఆసుపత్రిలో సరిపడ వైద్యులు లేరు. తక్కువ అనుభవం కలిగిన వైద్యులున్నారని సమాచారం. ఇఎస్ఐ అంటే ఉచిత వైద్యశాల అనేలా ఇక్కడ పనిచేసే వైద్యులు రోగుల పట్ల వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. నిరుపేద రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇక్కడ వైద్యులకు ప్రత్యేక గదులున్నప్పటికీ ముగ్గురు వైద్యులు ఒకే గదిలో కూర్చొని పిచ్చా పాటీ మాట్లాడుకుంటూ కాలం గడుపేస్తున్నారని రోగులు అంటున్నారు. సరైన మందులు ఇవ్వకపోవడం, వైద్యులు నిర్లక్ష్యంగా వైద్యం చేస్తుండడంతో రోగులు పెద్దగా రావడం లేదని తెలుస్తోంది. భారీగా తగ్గిపోయారని సిబ్బంది చెబుతున్నారు. మెడికల్ లీవ్ విషయంలోనూ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు డిస్పెన్సరీ ఉండేది. ఇప్పుడు సమయం కుదించినట్లు సమాచారం. ఈ సమయం రోగులకు ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. ఇక్కడ పనిచేసే ముగ్గురు వైద్యులు తూతూ మంత్రంగా వైద్యం చేసి, మధ్యాహ్నం నుంచి తమ ప్రయివేట్ ప్రాక్టీస్‌లో కాలం గడుపుతున్నట్లు తెలుస్తోంది. పరిశ్రమలు, ప్రభుత్వం వైఖరి వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో చిన్న పాటి వైద్యసేవలందించలేకున్నది ఇఎస్ఐ ఆసుపత్రిలో నిర్లక్ష్యంగా ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి మందులు, వైద్య సేవల విషయంలో చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

రెండు ఆటోల చక్రాలు చోరీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :అర్ధరాత్రి ఇళ్ల ముందు పార్క్ చేసి ఉన్న రెండు ఆటోల చక్రాలు చోరీకి గురయ్యాయి. ఆటోల యజమానులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని చిన్నచెరుకూరు గ్రామానికి చెందిన మోచర్ల సుధాకర్, మోచర్ల వెంకటేశ్వర్లు తమ ఆటోలను తమ ఇళ్ల ముందు పార్క్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ఈ రెండు ఆటోల చక్రాలను చోరీ చేశారు. దొంగలు సుధాకర్ ఆటోకు రెండు చక్రాలు, వెంకటేశ్వర్లు ఆటోకు ఒక చక్రం విప్పుకొని వెళ్లారు. ఆటోల చోరీలో అనుభవం కలిగిన వారే ఈ చోరీకు పాల్పడినట్లు బాధితులు చెబుతున్నారు. చోరీకి గురైన వీల్ రేటు దాదాపు 15 వేల రూపాయలు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం ఇదే గ్రామంలో ఆటో చక్రాల చోరీకి పాల్పడుతున్న దొంగను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మళ్లీ ఇప్పుడు ఆటోల చక్రాలు చోరీకి గురికావడం గమనార్హం. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏడు ఎకరాల గడ్డి వామి దగ్ధం

ప్రజాశక్తి-కోవూరు:ఏడు ఎకరాల గడ్డివామి అగ్నికి ఆహుతైన సంఘటన కొడవలూరు మండలంలోని గౌతమి నగర్ శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గౌతమి నగర్‌కు చెందిన మాతంగి మణి రైతుపశువుల మేత కోసం ఇటీవల ఏడు ఎకరాలకు సంబంధించిన గడ్డిని తమ ఇంటి వద్దకు చేర్పించి ఖాళీ స్థలంలో వామి వేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ వెలిగించి వేయడంతో గడ్డివామి దగ్ధమైందని స్థానికులు తెలిపారు. దగ్ధమైన వెంటనే స్థానిక యువకులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం తెలిపారు. ఫైర్ సిబ్బంది స్థానిక యువకుల సహాయంతో మంటలను అదుపు చేశారు. నిరుపేద అయిన రైతు ఎంతో శ్రమతో వేసుకున్న గడ్డివామి దగ్ధమవడంతో సుమారు రూ.50వేలు బాధితుడు నష్టపోయినట్టు వాపోయాడు. సంబంధిత అధికారులు చొరవ చూపి నష్టపోయిన బాధితుడికి ఆర్థిక సహాయం అందించాలని స్థానికులు కోరారు.

మంటలు ఆర్పుతున్న దృశ్యం

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్

ప్రజాశక్తి-నెల్లూరు


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

భారత ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధులను అప్రమత్తంగా నిర్వహించాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరి నారాయణన్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు కనుపర్తి పాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని, కౌటింగ్ విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది అందరూ కౌంటింగ్ ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించే ఒదుకు సంసిద్ధం కావాలన్నారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి, ఏజెంట్లకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా అందించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్‌కు కేటాయించబడిన రిజర్వు సిబ్బంది అందరూ కౌంటింగ్ కేంద్రంలోనే అందబాటులో ఉండాలన్నారు. కౌంటింగ్ సమయంలో అవసరమైన అన్నిరకాల ఫామ్స్, రబ్బరు స్టాంపు ముద్రలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం అందించిన హ్యాండ్ బుక్‌ను తప్పనిసరిగా చదివి నిబంధనలను అర్థం చేసుకోవాలని సూచించారు. రౌండ్లవారీగా ఫలితాలను ఫామ్-17సి లో పొందుపరిచి కౌంటింగ్ సూపర్‌వైజర్ ద్వారా రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. అదే విధంగా ఫామ్-17సి జెరాక్స్ కాపీని ఏజెంట్లకు అందజేసి అక్‌నాలెడ్జ్‌మెంటు కాపీని పొందాలని పేర్కొన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై నుడా వీసీ బాపిరెడ్డి, ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం (ఈటిపిబిఎస్) ఓట్ల లెక్కింపు ప్రక్రియపై నేషనల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్ అధికారి సురేష్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమ ంలో రిటర్నింగ్ అధికారులు సేథు మాధ వన్, వికాస్ మర్మత్, విద్యాధరి, చిన్నఓ బులేసు, మలోల, ప్రేమ్ కుమార్, మధులత, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న వేమిరెడ్డి దంపతులు

ప్రజాశక్తి-విడవలూరు :మండలంలోని ముదివర్తి గ్రామానికి చెందిన నిరుపేద తెలుగుదేశం కార్యకర్త చిల్లకూరు నిరంజన్ రెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురై ప్రమాద స్థితిలో ఉండడాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి స్థానిక మండల నాయకత్వం తీసుకెళ్లింది. వెంటనే స్పందించి తన సొంత ఖర్చుతో మెరుగైన వైద్యం చేయించారు. వేమిరెడ్డి దంపతుల దాతృత్వంతో పునర్జన్మ ప్రసాదించారని ఎప్పటికీ వారికి-పార్టీకి రుణపడి ఉంటానని నిరంజన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టపడి పార్టీ కోసం అహర్నిశలు పనిచేసే కార్యకర్తలను కన్నబిడ్డల్లా చూసుకునే వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వంటి నాయకులు లభించడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని తెలియజేస్తూ, నియోజకవర్గంలో రికార్డ్ స్థాయి మెజారిటీతో విజయం సాధిస్తామని మండల నాయకులు వ్యక్తం చేశారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

వరి యాజమాన్యం పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

తోటపల్లిగూడూరు మండలం తోటపల్లిగూడూరు బిట్ -1, మాచర్లవారిపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం సమగ్ర పోషక యాజమాన్యం పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఏఓ వి.వి శిరీష రాణి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతులను వినియోగిం చాలని సూ చించారు. రసాయన ఎరు వులను మాత్రమే వాడకు ండా సేంద్రియ పదార్థా లను ఉపయోగించాలని తెలిపారు. వరి పంటలో అధిక, సుస్థిర దిగుబడులు సాధించాలంటే పోషక పదార్థాలను తగిన మోతాదులో వాడాలని చెప్పారు. అవగాహన సదస్సుల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు పి. వినీల్, కె. విద్యాసాగర్ రెడ్డి కుసుమ, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శిరీషా రాణి

కౌంటింగ్ ప్రక్రియ పరిశీలనకు నలుగురు అబ్జర్వర్ల నియామకం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు నలుగురు అబ్జర్వ లను భారత ఎన్నికల సంఘం నియమించింది . రూరల్ మండల పరిధిలోని కనుపర్తిపాడు ప్రియ దర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ప్రారంభం కానుండగా, నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం అబ్జర్వర్లను నియమించింది. కందుకూరు, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అబ్జర్వర్ గా రామ్ కుమార్ గౌతమ్, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాలకు టీజీ అభిలాష్ కుమార్, కోవూరు, నెల్లూరు సిటీ, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు నితిన్ సింగ్ బదారియ, సర్వేపల్లి కి జయేంద్ర కుమార్ విజయవత్ అబ్జర్వర్లుగా వ్యవహరించనున్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎస్ఇ సందర్శన

ప్రజాశక్తి-నెల్లూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కేంద్రమైన ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీని విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.విజయన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనర మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్ , దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు సూచనల మేరకు స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రా లకు అంతరాయ రహిత నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే మూడు షిఫ్ట్ లలో సిబ్బంది 24 గంటలు పని చేస్తూ ఉన్నారని అసిస్టెంట్ ఇంజనీర్ స్థాయి వ్యక్తి ని ప్రతిరోజు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 4వ తేదీన విద్యుత్తు శాఖ సిబ్బందిని పూర్తిస్థా యిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఎటువంటి చిన్న సమస్యరాకుండ తగిన ఏర్పాట్లకు అని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌంటింగ్ రోజు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్‌ను, ఆరుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ లను విధులకు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు కూడ ఎన్నికల ఫలితాలను టి.వి.లలో వీక్షించేందుకు నిరంతర విద్యుత్ ను అందించాలని అన్ని డివిజన్‌ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ కు ఆదేశాలు జారీ చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఉన్న కనుపర్తిపాడు సబ్ స్టేషన్ ను సందర్శించి లాగ్ బుక్ పలు రిజిస్టర్‌లను పరిశీలించారు.


మాట్లాడుతన్న ఎస్ఇ విజయన్


నియామక పత్రాలు చూపుతున్న ఉద్యోగులు

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉద్యోగాల విజయోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు:కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శుక్రవారం ఉద్యోగాల విజయోత్సవం సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కందుకూరు ఎస్‌బిఐ టౌన్ బ్రాంచ్ మేనేజర్ జె.వంశీకృష్ణ మాట్లాడుతూ సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలి కోవాలని కోరారు.ఉద్యోగాలు పొంది సివిల్, ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థినీ విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ కె.మస్తానయ్య మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య గురించి వాటి ప్రాధాన్యతల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఈ అవకాశాన్ని కల్పించినా సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ సి నాగరాణి ఐఎఎస్‌కి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన సివిల్ , ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యార్థిని విద్యార్థులను ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఆఫీస్ కె వెంకటసుబ్బయ్య అభినందించారు. సెలెక్టు అయిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది సన్మానించారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న దృశ్యం

స్ట్రాంగ్ రూమ్‌కి చేర్చిన సర్వీస్ ఓట్లు

ప్రజాశక్తి-కందుకూరు.:కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన సర్వీసు ఓట్ల పోలింగ్ కొనసాగుతూనే ఉంది. సర్వీస్ ఓట్లు పోలింగ్‌లో భాగంగా శుక్రవారం స్థానిక ఎన్నికల అధికారి కార్యాలయానికి మూడు ఓట్లు బ్యాలెట్ ద్వారా రావడం జరిగింది. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో 66 ఓట్లు గాను 30 ఓట్లు పోలయ్యాయి. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్ రూపంలో వచ్చిన సర్వీస్ ఓట్లను కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని రికార్డు గదిలో భద్రపరిచారు.కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, వైసిపి చీఫ్ ఎలక్షన్ ఏజెంటు ముప్పవరపు కిషోర్, సాని కొమ్ము రంగనాయకుల రెడ్డి, టిడిపి చీఫ్ ఎలక్షన్ ఏజెంటు సిహెచ్ హరికృష్ణ, భద్రతా సిబ్బంది సమక్షంలో స్ట్రాంగ్ రూముకు సీలు వేసి భద్రపరిచారు.

ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభం

పజాశక్తి-నెల్లూరు సిటీ:

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు తెలుగు, సంస్కృతం, హిందీ, పరీక్షలు ఉదయం జరిగాయి. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 5,615 మందికి గాను 5,313 మంది విద్యార్థులు హాజరయ్యారు. 302 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఒకేషనల్ విద్యార్థులు 149 మందికి గాను 126 మంది విద్యార్థులు హాజరయ్యారు.23 మంది విద్యార్థులు హాజరు కాలేదు. మధ్యాహ్నం రెండవ సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జనరల్ విద్యార్థులు 640 మందికి గాను 583 మంది హాజరయ్యారు. 57 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఒకేషనల్ విద్యార్థులు 160 మందికి గాను 142 మంది విద్యార్థులు హాజరయ్యారు.18 మంది విద్యార్థులు హాజరు కాలేదు.37 పరీక్ష కేంద్రాలను ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులతోపాటు డివిఇఓ, డీఈసీ పరిశీలించారు.

26 నుంచి డిగ్రీ స్పాట్ వ్యాల్యుయేషన్ క్యాంప్

ప్రజాశక్తి-కందుకూరు:ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన రెండవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన స్పాట్ వ్యాల్యుయేషన్ (జవాబు పత్రాల మూల్యాంకనం) ఆదివారం మే 26వ తేదీ నుంచి కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమ వుతుందని ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు, కామర్స్, వృక్ష శాస్త్రము, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ ,మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులు తమ స్పాట్ ఆర్డర్ కాపీను, రిలీవింగ్ సర్టిఫికెట్‌ను తీసుకొని 26వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాల క్యాంప్ ఆఫీసర్‌కి రిపోర్ట్ చేయాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

పోలీసు సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి, అపరిష్కృతంగా ఉన్న పనులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్‌పి (అడ్మిన్) సిహెచ్ సౌజన్య పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన "పోలీస్ వెల్ఫేర్ డే" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు అర్జీలను స్వయంగా స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని సిబ్బందికి హామీ ఇచ్చారు. గ్రేడ్ ఇంక్రిమెంట్, బదిలీలు, సస్పెండ్ నుండి రిలీవ్, సర్వీసు సంబంధిత సమస్యలు, డిప్యుటేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, హౌసింగ్ లోను, అనారోగ్యం కారణంగా బదలా యింపు సంబంధిత అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు అర్జీలు స్వీకరించారు. అనంతరం డిపిఓ పరిపాలన విభాగ అధికారులకు ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగు ఆదేశాలు, సూచనలు చేశారు.

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గుడ్లూరు

రైతులు రసాయనక ఎరువులు వినియోగంపూర్తిగా ఆపివేయాలని దాని స్థానంలో నానో ఎరువులు పచ్చిరొట్ట ఎరువులు సహజ సిద్ధమైన జీవామృతం ఎరువులు వినియోగించాలని కందుకూరు సహాయక వ్యవసాయ సంచాలకులు పి అనసూర్య రైతులకు విజ్ఞప్తి చేశారు. భూసార పరీక్షలు అవగాహన సదస్సులు సందర్భంగా గుడ్లూరు మండలం అమ్మవారి పాలెం, చిన్న లాటరీపి, నాయుడుపాలెం గ్రామాల్లో రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించారు.

నేడు ఎపిపిఎస్‌సి పరీక్ష

- జిల్లాలో 5 కేంద్రాల్లో పరీక్ష
- హాజరుకానున్న 1070 మంది అభ్యర్థులు
- హాల్ టికెట్ తో పాటు, ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా వ్యాప్తంగా ఈనెల 25న (శనివారం) జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపిపిఎస్‌సి) పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు డిఆర్ఓ లవన్న తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో ఎస్ ఆర్ శంకరన్ హాల్లో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఎపిపిఎస్‌సి నిర్వహిస్తున్న ఆన్లైన్ పరీక్షపై సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో డిఆర్ఓ లవన్న, ఏపిపిఎస్‌సి సెక్షన్ అధికారులు జి అశోక్, రామాంజి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఆన్లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పరీక్షకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 1070 మంది అభ్యర్థులు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల పోటీ పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు సమకూర్చుకోవాలన్నారు. కావలిలో పిబిఆర్ విశ్వదయ ఇంజినీరింగ్ కాలేజీ, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో, కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, ముత్తుకూరు రోడ్ లోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, పొట్టెపాలెం సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆన్లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తున్నందున ఇంటర్నెట్, కంప్యూటర్ సాంకేతిక సమస్యలు లేకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలకు అనుమతించవద్దని, విద్యార్థులు హాల్ టికెట్ తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. ఎపిపిఎస్‌సి మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులు నిర్ణీత సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఏపిఎస్ ఆర్‌టిసి అధికారులు బస్సులను నడపాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లయజనింగ్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్ లు ఒక చెక్ లిస్ట్ తయారు చేసుకుని అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అధికారులందరూ సమన్వ యంతో పనిచేసి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో సమన్వయ అధికారులు బ్రహ్మయ్య, గోపికృష్ణ, ఇలియాజ్, గయాజ్, ప్రదీప్, చీఫ్ సూపరిం టెండెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఓ లవన్న

పొలాల్లోకివెళ్లే రహదారి ఆక్రమణ

ప్రజాశక్తి-కోవూరు

బుచ్చి మండలం, చెల్లాయి పాలెం గ్రామంలో ఓ ప్రబుద్ధుడు, ఆర్‌టిసి ఉద్యోగి అయి ఉండి రహదారిని ఆక్రమించి తన. పొలంలోకి మట్టిని తరలించి తను వేసిన లే అవుట్ కు తరలించిన.ఆ ఆర్‌టిసి ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వివరాల్లోకెళ్తే చెల్లాయి పాలెం గ్రామంలో,గ్రామం పుట్టినప్పటి నుంచి రహదారి నుంచి ట్రాక్టర్లు, గడ్డి ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు కూలీలు పోయే రహదారిని ఓ ఆర్టీసీ ఉద్యోగి రహదారిని ఆక్రమించారని గ్రామస్తుల ఆవేదన చెందారు. రహదారి విషయం స్థానిక విఆర్ఒకి, సచివాలయం సర్వేయర్‌కు తెలపగా స్వయంగా అధికారులే వచ్చి హద్దురాళ్ల పాతి వెళ్లారని తెలిపారు. రహదారి ఆక్రమించిన ఆర్టీసీ ఉద్యోగి తో కూడా అధికారులు మాట్లాడి, ఇంతటితో ఆపమని చెప్పినట్లు సమాచారం ఉన్నట్లుగా గ్రామస్తులు తెలిపారు. ఈ రహదారి ద్వారా రేబాల గ్రామం నుంచి జొన్నవాడ శ్రీ కామాక్షమ్మ దేవికి. పసుపు. కుంకుమ. సారెలు, పూర్వంలో ఇక్కడ. నివసించే పెద్దలు ఈ రహదారి నుంచే తీసుకెళ్లి వారి వారి మొక్కులు తీర్చుకునే వారని తెలిపారు. అలాంటి రహదారిని ఆర్టీసీ ఉద్యోగి అయిన కోవూరు విజయకుమార్ ఆక్రమించడంపై గ్రామస్తులు మండిపడుతూ, అట్టివారిపై బుచ్చిరెడ్డిపాలెం మండల తహశీల్దార్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదేవిధంగా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిచో జిల్లా అధికారి అయిన కలెక్టర్‌కు, ఆర్‌టిసి డిఎంకు ఫిర్యాదులు చేస్తామని చెల్లాయిపాలెం గ్రామస్తులు తెలిపారు.

ఇండియా కూటమిపై మోడీ కుట్రలు

ప్రజాశక్తి-కావలి : లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోడీ మితిమీరిన హిందుత్వ ప్రచారం చేయడం గర్హనీయమని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు ప్రకటనలో ఖండించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు అంటూనే, కులతత్వం, మతతత్వాలను తాను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటూ దొంగే.. దొంగా దొంగా.. అని అరుస్తున్నట్లుగా విపక్ష కూటమిని విమర్శిస్తూ ఎన్నికల ప్రచారంలో "ముస్లిములకు రిజర్వేషన్లు ఇవ్వడానికి 'ఇండియా' కూటమి కుట్రలు పన్నుతుందన్నారు. వారు అధికారంలోకి వస్తే, "రామ్ రామ్" అన్నవారిని అరెస్టు చేస్తారని, కాంగ్రెస్ దేశాన్ని ముక్కలు చేసి పాకిస్తాన్ – బంగ్లాదేశ్ అనే ముస్లిం రాజ్యాలను సృష్టించిందని, అధికారంలోకి కాంగ్రెస్ వస్తే, అయోధ్య రామమందిరానికి తాళం వేస్తారని ప్రచారం చేస్తున్నారన్నారు. "మన ఆరాధన – విశ్వాసాలను కాంగ్రెస్, కించపరుస్తుందని, "విభజించూ మిగిలిన భారతదేశ వనరులపై మొదటి హక్కు ముస్లిములకే ఉంది, అని విద్వేషపూరిత నేతలు అంటున్నారు "అని రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లను కాజేయాలని చూస్తున్నారని, హిందువులను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడమే రాజ్యాంగ వ్యతిరేకమని మోడీ గ్రహించడంలేదన్నారు. తాము గెలిస్తే ముస్లిం రిజర్వేషన్లను ఎత్తేస్తామని పలు సభల్లో చెప్పిన మోడీ, ఇప్పుడా నెపాన్ని ప్రతిపక్షాలమీదకి నెట్టేస్తూ ఇష్టానుసారం, అర్ధరహిత ఆరోపణలు చేస్తూ, ప్రధాని పదవికే తలవంపులు తేవడం భారత ప్రజాస్వామ్యానికి తలఒంపులన్నారు. మతతత్వ పార్టీలు గెలిస్తే, భారత దేశంలో మత సామరస్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. 2014-2019 ఎన్నికల తర్వాత ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం నిరూపించిందని, పంజాబ్, హర్యానా రైతులు " గో బ్యాక్ " అంటూ ప్రతిఘటిస్తే, ఓటమి భయం పట్టుకుని మోడీ చేసే ప్రేలాపనలను ఓటర్లు అర్థం చేసుకుంటున్నారని, కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు సి.శారద, షేక్.ఫాతిమా, జామీమ్, టి.సుజాత, షేక్.నూర్జహాన్, సుహాసిని, చైతన్య తెలిపారు.

ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రసాయనాల, పురుగు మందుల వాడకం తగ్గడం వల్ల దానివలన రైతులకు ఖర్చు తగ్గుతుందని, ఆదాయం పెరుగుతుందని, ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చని డిపిఎం మాలకొండయ్య తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని మహిమలూరు గ్రామంలో ఎపిసిఎన్ఎఫ్ (కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పిఎండిఎస్ కిట్లు తయారు చేశారు. 30 రకాల విత్తనాలతో నువ్వులు, పచ్చిరొట్ట ఎరువులు, కూరగాయల గడ్డజాతి, తీగజాతి విత్తనాలతో ఒక ఎకరాకు 12 కేజీలలో కిట్లు తయారు చేశారు. కార్యక్రమంలో ఎడిఎపిఎం మునిరత్నం, ఎన్ఎఫ్ చంద్ర, ఎల్ టి సుబ్బారాయుడు తదితరులున్నారు.

అల్లిమడుగులో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం అల్లిమడుగు గ్రామ సంఘంలో శుక్రవారం సాయంత్రం కావలి రూరల్ సిఐ నాగభూషణం ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగభూషణం మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రౌడీ షీటర్లను అనుమానితులను గుర్తించి అదుపులో తీసుకునేందుకు ముందు జాగ్రత్తగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో గుర్తు తెలియని వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 08626-2462233 గానీ, 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని తెలపాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలు కనుగొన్నారని, కేసు నమోదు చేసి బిట్రగుంట పోలీస్ స్టేషన్ కు తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో బిట్రగుంట ఎస్ఐ బొజ్జ, బిట్రగుంట, అల్లూరు, దగదర్తి పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి గెలుపు ఖాయం

ప్రజాశక్తి-ఉదయగిరి : కూటమి ఎన్ని కుట్రలు పన్నిన మేకపాటి కుటుంబంలోని ప్రజా నేత ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి 10వేల మెజార్టీతో గెలుపు ఖాయమని జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. 13న జరిగిన పోలింగ్‌పై ఎనిమిది మండలాల వైసిపి ఓటింగ్ శాతంపై సుదీర్ఘ చర్చ చేశారు. ఈ సందర్భంగా మోడీ రామాంజనేయులు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మంచి మెజార్టీ వస్తుందని అలాగే ఉదయగిరి నియోజకవర్గం మొత్తం మీద పదివేల మెజార్టీతో ఎంఎల్ఎ అభ్యర్థిగా రాజగోపాల్ రెడ్డి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. 151 సీట్లను తిరగరాస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండోసారి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. అందరి ఆప్త బంధువు మకుటంలేని నాయకుడు ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డి జిల్లాలో గుర్తుండేలా గెలుపొందబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు గణపం రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-కావలి : సమాజంలో పీడనలేని, అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ప్రజాస్వామికవాదులు, పౌర సంస్థలు కృషి చేయాలని ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతలు, స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్నా నవ సమాజ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు అధికారులు స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యపరిచి ఆదర్శ వంతమైన సమాజాన్ని నిర్మించడానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. భారతదేశంలో ఎంతోమంది సంఘసంస్కర్తలు సామాజిక రుగ్మతులపై పోరాడి ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపూర్ణం కావడానికి కృషి చేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో భారతరత్న బి.ఆర్.అంబేద్కర్, గాంధీజీ, లోక్‌నాయక్, జయప్రకాష్ నారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య, లాంటి ఎందరో మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని అవినీతికి తావులేని స్వచ్ఛమైన పరిపాలన అందించేలా వ్యవస్థను నిర్మించాలని ప్రజలు, ప్రజాస్వామికవాదులు నిరంతరం సమాజాన్ని మేల్కొల్పాలని కోరారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కావలి శ్రీనివాస భజన మండలి

ప్రజాశక్తి-కావలి : తిరుపతి గోవింద రాజస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కావలి నుండి శ్రీనివాస భజన మండలి "ఉమావాణి" ఆధ్వర్యంలో కోలాటం ప్రోగ్రాం నిర్వహించారు. వేలాది మంది పాల్గొన్న వారితో తాము స్వామి వారు దగ్గర కోలాటం ప్రదర్శన చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, తమను తిరుపతికి తీసుకొని వెళ్లి కోలాటం ప్రదర్శనలో పాల్గొనేటట్లు చేసిన "ఉమావాణి"కి ప్రత్యేక ధన్యవాదాలు అని కోలాటం మహిళలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉమావాణి గురువు, శ్రీనివాస రావు, లక్ష్మమ్మ, దుగ్గిశెట్టి హేమలత, శిరీష, దుర్గా లక్ష్మి, సులోచన, శ్రీలేఖ, సరిత, సురేఖ, లతా సుబ్బమ్మ, సంధ్య, రాధిక వెంగమ్మ, సీత, తిరుమల అనసూయమ్మ, ఇందిరమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని ఓగురువాండ్ల పల్లి గ్రామంలో సీతారామ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సీతారామ ఉత్సవాలలో భాగంగా తొలి రోజైన శుక్రవారం సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. గ్రామ చుట్టుపక్కల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణంలో పాల్గొన్నారు. సీతారామ ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్రతిరోజు నిత్య అన్నదానం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలలో భక్తులు, చుట్టుపక్కల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలం మాతినవారిపాలెం గ్రామంలోని ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఎన్‌డిఎ కూటమి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మళ్లీ కేసులు గ్రామంలో నమోదవడంతో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అనారోగ్య బారిన పడటానికి ఉన్న కారణాలను వైద్య సిబ్బంది వెల్లడించాలని, ప్రజల ప్రాణాలతో ఆడుకునే విధంగా నిర్లక్ష్యానికి తావివ్వకూడదని అన్నారు. ఎలాంటి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యశాలలో చేరాలని, అశ్రద్ధ చేయకూడదని ఆయన ప్రజలకు తెలిపారు. తాను, తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ గ్రామంలోని ప్రజలకు అండగా ఉంటామని, ఎలాంటి సహాయం అవసరం అయిన అందించేందుకు సిద్ధంగా ఉంటామని ఆయన తెలిపారు. గ్రామంలోని పరిస్థితులు అదుపులోకి వచ్చేవరకు వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ గ్రామంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను కోరారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- కేజీ మిర్చి ధర రూ.100
- కేజీ వంకాయల ధర రూ.50

ప్రజాశక్తి-కందుకూరు

కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పెరుగుతున్న కూరగాయల ధరలను చూసి ప్రజలు కొనలేక నోర్లు వెళ్ల బెడుతున్నారు. వారం రోజుల క్రితం వరకు ధరలు కాస్త తక్కువగా ఉండటంతో ప్రజలు కొనుగోలుకు పెద్దగా ఇబ్బంది పడలేదు. ప్రస్తుతం ఏ రకం కూరగాయలు పేద ,మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. నిన్న మొన్నటి వరకు కేజీ 36 రూపాయలకు పలికిన చిక్కుడు ధర ఏకంగా 100 రూపాయలకు చేరిందంటే ధరలు ఏ విధంగా పెరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. పేదవారి పచ్చడి మెతుకులకు ఉపయోగించే మిర్చి ధరలు అమాంతంగా పెరిగాయి. మిర్చి దొరకని పరిస్థితి ఏర్పడింది. 25 రూపాయలకే వచ్చిన టమోటా ధర రోజురోజుకు పెరుగుతూ కేజీ రూ.40లకు చేరింది. రూ.20 వంకాయల ధర కేజీ 50 రూపాయలకు చేరింది. బెండకాయల ధర అమాంతంగా పెరిగింది. 60 రూపాయలు కేజీ పలుకుతుంది. బీరకాయల ధర కేజీ 80 రూపాయలకు చేరింది. క్యాబేజీ ధర 45 రూపాయలు అయింది. క్యారెట్ కేజీ 60 రూపాయలు మార్కెట్లో పలుకుతుంది. 15 రూపాయలకే వచ్చిన దొండకాయలు కేజీ 35 రూపాయలకు పెరిగింది. కాలీఫ్లవర్ కేజీ 60 రూపాయలకు అమ్ముతున్నారు. కేజీ 15 రూపాయలకే వచ్చే దోసకాయలు కేజీ 35 రూపాయలు అమ్ముతున్నారు. గోరుచిక్కుళ్ళ కేజీ 60రూపాయలు అంటే ప్రజలు నోర్లు వెళ్లబెడుతున్నారు. కేజీ 20 రూపాయలకి మించి ఎనాడు అమ్మని చామదుంపల ధర ప్రస్తుతం బాగా పెరిగింది. సొరకాయ 30కి అమ్ముతున్నారు. బీట్రూట్ కేజీ 50 రూపాయలు పలుకుతుంది. అల్లం కేజీ ధర బజార్లో అయితే 180 రూపాయలు ఉండగా బయట దుకాణాల్లో రూ.250 అమ్ముతున్నారు. ధరలు ఇంకా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు ఇంకా పెరిగితే పేద ప్రజలు ఎలా కొనాలి ఎలా తినాలి అనే ప్రశ్న ఎదురవుతుంది.

కష్టజీవులకు అండగా ఎర్రజెండా..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

సోషలిస్టు రాజ్య స్థాపన కోసం కార్మికవర్గం ఐక్యమై పోరాటం నడపాలని కష్టజీవుల పాలిట ఎర్రజెండా నిలుస్తుందని ఎన్ని సిద్ధాంతాలు వచ్చినా కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం అజేయమని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో జరిగిన సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు రాజకీయాలు కుల, మత, ప్రాంతీయ తత్వాలతోపాటు ధన రాజకీయాలుగా మారాయన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టి తమ రాజకీయ ప్రయోజనాలను వాడుకోవాలని చూస్తున్న బిజెపి లాంటి మతతత్వ పార్టీలను అందరూ ఐక్యమై తిరస్కరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు బిజెపికి వంత పాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను ప్రజల ప్రయోజనాలను తిలోదకాలు ఇచ్చి ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ చేసే ఆందోళనల్లో, పోరాటాల్లో కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తిప్పిరెడ్డి ప్రసాద్, జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా, ఆటో యూనియన్ నగర కార్యదర్శి పిడుగు మురళి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను నరేంద్ర, సిపిఎం మండల కార్యదర్శి కోటేశ్వరరావు, సిఐటియు మండల నాయకులు చాంద్ బాషా, ఖీగల్ ఆదర్శ్ శ్యామ్ రెడ్డి, సిద్ధవరపు ప్రభాకర్ రెడ్డి ,నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు నాశిన పరశు రామయ్య, ఇందుకూరుపేట ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దయా సాగర్, వాసు మాల్యాద్రి, వెన్ను వేణు, ఆటో కార్మికులు సిపిఎం కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న అక్షయ సంస్థ అధినేత బాలశైలజ

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి..

ప్రజాశక్తి-బిట్రగుంట

పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరం తప్పనిసరిగా ఒక మొక్కను నాటుదామని అక్షయ ఉమెన్స్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ అధినేత బాల శైలజ పేర్కొన్నారు. ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణపై విశ్వనాథరావుపేటలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో 40 మొక్కలను స్వచ్ఛంద సేవాసంస్థ అధినేత బాల శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వనాథరావుపేట సర్పంచ్ గండూరి మంజుల, కావలి డి వై ఇ ఒ ఎం రఘురామయ్య ,ఎం,ఈ,ఓ 1 నరసింహారావు ,ఎం,ఈ,ఓ 2 జయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలోని మార్పులతో సరైన వర్షపాతం నమోదు అవ్వట్లేదని, సకాలంలో వర్షాలు కురవడం లేదని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ తమ ఇంటి కాంపౌండ్‌లో చెట్లను పెంచడం మంచిదని తెలిపారు. చెట్లను పెంచడం వల్ల వాహన నుండి వెలువడే కార్బన్‌డయాక్సైడ్‌ను చెట్లు తీసుకొని మనకు అవసరమైన ఆక్సిజన్ విడుదల చేస్తాయని, సకాలంలో వర్షాలు కురుస్తాయని, ఎండ తీవ్రత కూడా తగ్గుతుందని తెలిపారు. ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం వల్ల పర్యావరణానికి ఎంతగానో మేలు జరుగుతుందని, ప్రతిఒక్కరూ కాటన్ సంచులను ఉపయోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ బాలికల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, జెడ్‌పిహెచ్‌ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఠాగూర్, ఆరోగ్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరోజనమ్మ నేత్రదానం

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని దంపూరులో పోశంరెడ్డి సరోజనమ్మ (70) శనివారం మధ్యాహ్నం మృతిచెందగా కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను మన సేవాసంస్థ సహకారంతో నెల్లూరు మోహన్ ఐ హాస్పిటల్‌కు కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదానం చేశారు. కార్యక్రమంలో ఐ టెక్నీషియన్ వేణు నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డీ..బ్లడ్ శాంపిల్స్ ఇస్తారా..!

నా పాస్‌పోర్టు ఇదిగో.. : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఇటీవల బెంగుళూరులో జరిగిన రేవ్ పార్టీకి తనకి ఎటువంటి సంబంధం లేదని, అసలు మందు, డ్రగ్స్, ఇతర ఏ అలవాటు లేదని దమ్ముంటే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనతో కలిసి బడ్ల్ శాంపిల్స్ ఇవ్వాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం వైసిపి కార్యాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగుళూరు లో జరిగిన రేవ్ పార్టీలో తన పాస్ పోర్టు ఉందని, తన ప్రమేయం ఉందని, తనపై బురదజల్లే ప్రయత్నంను సోమిరెడ్డి చేస్తున్నారన్నారు. తనకు రేవ్ పార్టీకి ఎటువంటి సంబంధమూ లేదన్నారు. రేవ్ పార్టీ పై అక్కడ పోలీసులు చేసిన విచారణలో ఎక్కడా తనకు గాని తనకు సంబంధించిన వారు ఎవరు లేరన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నిరాధరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. సోమిరెడ్డి తనతో బడ్ల్ శాంపిల్స్‌కు సిద్ధమా అన్నారు. సోమిరెడ్డికి దమ్ముంటే తన సవాల్‌కు ఒప్పుకుని ముందుకు రావాలన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మూడోసారి కూడా సర్వేపల్లి లో ఓడిపోతున్నారన్నారు. తనకు మందు, డ్రగ్స్, ఇతర ఏ అలవాటు లేదన్నారు. సోమిరెడ్డికి మందు, పేకాట, డ్రగ్స్ అన్నింటితో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఎవరు తన పేరుపై ఉన్న ఎంఎల్ఎ స్టిక్టర్‌ను ఫోన్‌లో తీసుకొని, కలర్ జెరాక్స్ కారుకు పెట్టుకున్నారన్నారు. అక్కడ ఉన్నవారితో ఎవరితోనూ తనకు ఎలాంటి సంబంధాలు లేవన్నారు. సోమిరెడ్డి తన పాస్‌పోర్టు ఉందని చెబుతున్నారన్నారు. ఇదిగో నా పాస్‌పోర్టు తనవద్దే ఉందని, తెలిపారు. నియోజవర్గంలో ఓటుకు నోటు పంపిణీ చేశారన్నారు. రేవ్ పార్టీకి సంబందించి ఏ ఒక్క ఆరోపణలో నిజం లేదన్నారు. తాను దేనికైనా సిద్ధంగా ఉన్నానన్నారు. పరీక్షలకైనా, దేవుని వద్ద ప్రమాణం చేయడానికైనా సిద్ధంగా ఉన్నానన్నారు. అందుకు సిద్ధమైతే చంద్రమోహన్‌రెడ్డి రావాలన్నారు. తన స్టిక్కర్ దొంగతనంకు సంబందించి ఎప్‌పికి ఫిర్యాదు చేశామని, ఐదో నగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. పోలీసు విచారణలో మొత్తం వ్యవహారం బయటకొస్తుందని తెలిపారు.

నిబంధనలతో కౌంటింగ్

ప్రజాశక్తి - నెల్లూరు

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ యం.హరి నారాయణన్ రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్వోలు , ఎఆర్వోలతో కౌంటింగ్ నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలు, ఆర్పి యాక్ట్ చదివి అర్థం చేసుకుని కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఆర్వోలు ఏఆర్వోలు సమన్వయంతో పనిచేసి నిష్పక్షపాతంగా, సమర్ధ వంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ హల్లో పోస్టల్ బ్యాలెట్, ఇ వి ఎం.ల ఓట్ల లెక్కింపు అవసరమైన టేబుల్స్, ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కౌంటింగ్ రోజు అన్ని వాహనాలు కనపర్తిపాడు లోని హైస్కూల్ వరకు మాత్రమే అనుమతించబడతాయని అందువల్ల ఏజెంట్లు, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ని తరలించడానికి తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారులు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి డి ఆర్ఒ ఎస్.లవన్న నుడా విసి బాపిరెడ్డి, ఓబులేసు, ప్రేమ్ కుమార్, మాలోల, మధులత, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, ఎఆర్ఒలు పాల్గొన్నారు.

26న చెర్లో రమణారెడ్డి వర్థంతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

డాక్టర్ చెర్లో రమణారెడ్డి వర్థంతి సభ 26వ తేదీ ఆదివారం సిపిఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు తెలిపారు. సమావేశానికి సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు సమావేశానికి హాజరై ప్రసంగింస్తారని తెలిపారు. కార్యక్రమానికి సిపిఎం నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా తెలియజేశారు.

ఉదయగిరిలో రాజన్నదే గెలుపు

ప్రజాశక్తి-ఉదయగిరి

జూన్ 4న వెల్లడి కానున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉదయగిరి కోటపై వైసిపి జెండా రెపరెపలాడుతుందని ఉదయగిరి బిట్ -1 ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం దుత్తలూరులోని వైసిపి ప్రధాన పార్టీ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ వైసిపి అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య జరిగిన ఎన్నికల ఫలితాలపై చర్చలు కొనసాగాయి. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో వైసిపికి అత్యధిక మెజార్టీ వస్తుందని గత 40 సంవత్సరాలుగా నియోజకవర్గంలో మేకపాటి కుటుంబం రాజకీయ ప్రస్థానం చేస్తుందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పోటీ చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి తన తనయుడు యువనేత అభినవరెడ్డి గతంలో ఎన్నికల సమయంలో మెట్ట ప్రాంతానికి వచ్చి వరాలు కురిపిస్తూ కఠోర శ్రమ పడ్డారని దాంతో కార్యకర్తలు నాయకుల్లో కూడా మనోధైర్యం ఉత్సాహం కలిగి పార్టీ విజయానికి ముందుకు సాగించడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో తిరిగి 150 స్థానాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఖాయమని ఆశాభవం వ్యక్తం చేశారు.

రేపు జెవివి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-కావలి

కావలిలోని ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర ఆదివారం ఉదయం 8గంటలకు కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జె.వి.వి. పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. కావున జె.వి.వి. కార్యవర్గ సభ్యులు అందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు.

పోలింగ్ సిబ్బందిపై చర్యలు తగవు..

- పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి నాటకం తిరుమలయ్య

ప్రజాశక్తి-నెల్లూరు : 13వ తేదీన పల్నాడు జిల్లా మాచెర్ల నియోజకవర్గం, పాల్వాయి గేట్ గ్రామంలోని పోలింగ్ కేంద్రం నెంబరు 202లో ఓటింగ్ యంత్రాల ధ్వంసం చేసిన ఘటనకు ప్రధాన కారణమైన వైసిపి అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోకుండా పోలింగ్ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం తగదని పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి నాటకం తిరుమలయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. 13న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లా మాచెర్ల నియోజకవర్గం నందు గల పాల్వాయి గేట్ గ్రామంలో పోలింగ్ కేంద్రం 202లో ఓటింగ్ యంత్రాన్ని ధ్వంసం చేసినట్లు ఎన్నికల సంఘం నిర్ధారించి, ఈ ఘటనకు ప్రధాన కారణమైన వైసిపి అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిని పోలీసులు అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు అరెస్టు చేయకుండా ఈ ఘటనకు కారణమైన వ్యక్తి న్యాయవాదుల సహకారంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఊరట పొందారన్నారు. వాస్తవానికి ఈ ఘటనను అడ్డుకునేందుకు శక్తి లేక చూస్తూ ఉండిపోయిన చిన్న స్థాయి ఉద్యోగులైన పోలింగ్ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం దుర్మార్గ మన్నారు. ఉన్నత అధికారులు ఆలోచించి చిరుద్యోగులు బలి కాకుండా న్యాయబద్ధంగా వ్యవహరించాలని జిల్లా పిఆర్‌టియు శాఖ నుంచి ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

ప్రజాశక్తి-ఉదయగిరి

మనబడి నాడు-నేడు పనుల నిర్వహణపై మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని మండల అభివృద్ధి అధికారిణి డి.ఈశ్వరమ్మ, ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు నిర్వహించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల అభివృద్ధి అధికారిణి ఈశ్వరమ్మ అధ్యక్షతన ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు నేతృత్వంలో మండలంలోని మనబడి నాడు-నేడుకు ఎంపిక కాబడిన 25 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న పనులపై వారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ చివరి దశలో ఉన్న పనులను త్వరితిగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి పనిలోనూ నాణ్యమైన వస్తువులను వాడుతూ నాణ్యతగా పూర్తి అయిన కాంక్రీట్ గోడలకు, కాంపౌండ్ వాల్స్‌కు ప్రతిరోజు ఉదయం సాయంత్రం వాటర్‌తో క్యూరింగ్ చేయలాన్నారు. పాఠశాలలో చివరి దశలో పనులు ఉండి నిధుల కొరత ఉన్న పాఠశాలలు తమ దృష్టికి తీసుకు వచ్చిన ఎడల నిధులు మిగిలి ఉన్న పాఠశాలల టిఇఒ ద్వారా నిధులు జమచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎఇ శ్రావణ్ కుమార్, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరమ్మ

ఎంపిడిఒగా బాలాజీ బాధ్యతలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

తోటపల్లి గూడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికా రిగా కె.ఎన్. బాలాజీ నియమితుల య్యారు. ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో కొంతకాలం ఈఓపిఆర్ అండ్ ఆర్డి నారాయణ రెడ్డి ఎంపీడీఓ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఇందుకూరుపేట ఎంపీడీఓ సాయిలహరి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆ స్థానంలో చిత్తూరు జిల్లా పెద్ద తిమ్మసముద్రం ఎంపీడీఓ బాలాజీ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన అధికార బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ బాలాజీకి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికింది.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు గోళ్ళ.గుణవతీదేవి రెండో వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు - కోడలు డాక్టర్ జి.పార్థసారథి రాజు - డాక్టర్ ఉషారాణి, మనవరాలు డాక్టర్ జి.జాహ్నవి సహకారంతో సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో శుక్రవారం 80మంది పేద పిల్లలకు ఎగ్ బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో దాత డాక్టర్ ఉషారాణి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా పేదలకు అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. తాము కూడా సంయుక్త సేవాసంస్థలో సభ్యులుగా చేరి సంస్థ ద్వారా ఒక నిరుపేద అమ్మాయిని దత్తత తీసుకొని చదివిస్తూ ఉన్నామని తెలిపారు. దానిలో భాగంగానే నేడు వారి అత్తయ్య జ్ఞాపకార్థంగా పేద పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ కుటుంబం నుంచి సంయుక్త సేవాసంస్థ ద్వారా అనేక సేవలు అందిస్తామని తెలిపారు. సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా పేద పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేసిన దాతలు డాక్టర్ జి పార్థసారథి రాజు - డాక్టర్ ఉషారాణి దంపతులకు, డాక్టర్ జి.జాహ్నవికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్షకు 33 మంది హాజరు కావలసి ఉండగా 31మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం హిందీ పరీక్షలు 19 మంది విద్యార్థులకు గానూ 17మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ హనుమంతు తెలియజేశారు.

బివినగర్‌లో ఓల్టేజీ సమస్య

ప్రజాశక్తి-నెల్లూరు

భక్తవత్సలనగర్ ప్రాంతంలో ఓల్టేజీ సమస్య తలెత్తడంతో వినియోగదారులు నానా ఇబ్బందులకు గురైయ్యారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ సమస్య ఎదురు కావడంతో సమాచారం సబ్‌స్టేషన్లకు అందజేసేందుకు ఫోన్ చేసినా సిబ్బంది స్పందించకపోవడం దారుణం. వేసవి కారణంగా ప్రజలు ఉక్కపోతను తట్టుకోలేక ఫ్యాన్లు వేసుకోవాలన్న ఆలోచన వచ్చినా లో ఓల్టేజ్ కారణంగా ఫ్యాన్లు, ఏసిలు, పనిచేయకుండా మొరాయించాయి. ఆ శాఖ అధికారులు మాత్రం సమస్య వస్తే తమ దృష్టికి తీసుకోస్తే పరిష్కరిస్తామంటూ రాజకీయ నాయకులకు ధీటుగా హామీలు కురిపిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని, వాట్సప్ గ్రూప్‌లో సమాచారం ఇచ్చినా వెంటనే స్పందించి పరిష్కరిస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు. ఈ మాటలు కేవలం ప్రకటనలకు మాత్రమే సరిపోతున్నాయి. లో ఓల్టేజీ సమస్య ఉందని 9 గంటలకు వాట్సాఫ్ గ్రూప్‌లో సమాచారం ఇస్తే 12 గంటలకు సిబ్బంది ఫోన్ చేసి వివరాలు అడగటం కనిపించింది. సమాచారం ఇచ్చిన మూడు గంటలకు సిబ్బంది స్పందించి వినియోగదారులకు ఫోన్ చేసి వివరాలు అడుగుతున్నారంటే సిబ్బంది పనితీరు ఏమాత్రం ఉందో ఇట్టే అర్థమౌతుంది.

పొగాకు వేలం ధరలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 822పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా వాటిలో 777పొగాకు బేళ్ళను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 22పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వీటిలో ఎన్ఎస్ 045ఎన్ బి14సిఆర్ 03ఉన్నాయని, అధిక బరువుతో ఉన్న 23 పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.320కాగా కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.272.10నమోదు కాగా, వేలం లో 22మంది కంపెనీ వ్యాపారస్థులు పాల్గొన్నారన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విడవలూరు

ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ఎవరైన అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజా తెలిపారు. శుక్రవారం సిబ్బందితో కలిసి విడవలూరు మెయిన్ బజారు కూడలిలో ఎన్నికల కౌంటింగ్ దగ్గర్లో ఉన్నందున ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజా మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి అల్లర్లు ఆసాంఘిక కార్యక్రమాలు జరిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

నా పేరు షేక్.పీర్ల నిసార్ అహమ్మద్,
PASSPORT NO. X8360672
నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ తురకపాలెం నుండి సీతారామపురం బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైనా దొరికినయెడల ఈ క్రింది సెల్ నెంబర్‌లో కాంటాక్ట్ చేయగలరు.
98664 21861

ప్రజాశక్తి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శ్రీ మాల్యాద్రి లక్ష్మి నృసింహ స్వామి
జయంతోత్సవ ప్రత్యేక అనుబంధం

VIII Pages ADVT FEATURE

శనివారం 25 మే 2024

నేడు లక్ష్మి నృసింహ స్వామి జయంతోత్సవ వేడుకలు

భక్తుల సౌకర్యార్థం పటిష్ట ఏర్పాట్లు - మాలకొండ దేవస్థానం ఈఓ కెబి శ్రీనివాసరావు

కెబి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మి నృసింహ స్వామి జయంతి ఉత్సవ వేడుకలు నేడు మాలకొండలో ఘనంగా నిర్వహించనున్నారు. స్వామి వారి జయంతికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చు అవకాశం ఉన్న నేపథ్యంలో తదనగుణంగా భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు దేవాదాయ శాఖ

సహాయ కమిషనర్, దేవస్థానం కార్య నిర్వహణాధికారి కె బి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మాలకొండ జయంతి సందర్భంగా దాదాపు 50 వేల మందికి పైగానే భక్తులు ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుండే భక్తులందరికీ ఉచిత

▶ 4లో

మెరుగైన వసతుల కల్పనకు కృషి

డేగా వెంకటేశ్వర్లు, సర్పంచ్ అయ్యవారి పల్లె

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

భక్తులకు ఇంకా మెరుగైన వసతులు కల్పించేందుకు అవకాశం ఉందని అయ్యవారిపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు (బుజ్జి) తెలిపారు. పంచాయతీ పరిధిలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనసింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సంఖ్య ఏడాదికేడాదికీ పెరుగుతుం దన్నారు. దేవస్థాన ఆదాయం కూడా భారీగానే పెరిగిం దన్నారు. ఇందుకు తగిన వసతులను కల్పించే ందుకు ఇంకా ఆలయ అధికారులు నిరంతరం అభివృద్ధిపై దృష్టి సారిస్తే బాగుంటుందన్నారు. పూర్తిగా అటవీ ప్రాంతం కావడంతో ఇక్కడకు చేరుకున్న భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకూడదన్నారు. కొండ దిగువ భాగాన నిద్ర చేయడానికి వచ్చిన భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి. కొండ కింద భక్తుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ ను నిర్మించా లన్నారు.వాహనాల పార్కింగ్ స్థలంలోనూ షెడ్లు ఏర్పాటు ఏర్పాటు చేసే విధంగా. చర్యలు తీసుకోవాలన్నారు. కొండపై వసతులు కల్పించేందుకు కృషి చేసిన దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.బి శ్రీనివాసరావుకి, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఎంఎల్ఎ పర్యవేక్షణ అద్భుతం

యాళ్ల శివకుమార్ రెడ్డి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మాల కొండ దేవాలయం అభివృద్ధిలో ముందు ంది. కందుకూరు శా స న స భ్యు లు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంతో పోల్చుకుంటే ప్రతి ఏటా స్వామివారి ఆదా యం గణనీయంగా పెరు గుతూ వస్తుంది. శనివారం వచ్చిందంటే ఎంఎల్ఎ ఇక్క డకు రావడం, సాధారణ భక్తులతో పాటే ఆయన కూడా స్వామివారి దర్శనం చేసుకోవడం, ఎలాంటి ఆర్భాటం లేకుండా భక్తుల మధ్యనే తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కరించే దిశగా అధికారులకు సూచనలిస్తూ ఉండటం విశేషం. భక్తుల సౌకర్యార్థం పనుల విషయంలో రాజీ పడ కుండా, ఉన్నతాది కారులను సంప్ర దించి పట్టు వదలని విక్రమా ర్కుడిలా ఆ పనులు పూర్తయ్యేలా మండల పరిధిలో దేవాలయం ఉండటం, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని పోలినేని చెరువు గ్రామానికి చెందిన యాళ్ల శివ కమార్ రెడ్డి చెప్పారు.

మాలకొండ దర్శనం మహా భాగ్యమే

చుండి సర్పంచ్ సతీష్

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: :మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహ స్వామి ఆలయాన్ని దర్శించడం మహాభాగ్యంగా భావిం చాలని చుండి సర్పంచి వీరపని సతీష్ చెప్పారు. త మ మండలంలో ఆల యం ఉండడంతో మండ లానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నట్లు చెప్పారు. పశ్చిమ ప్రాం తంలో భక్తులు అధికంగా ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడ వారు పేర్లు కూడా మాలకొండయ్య లక్ష్మమ్మ వంటివి ఎక్కువగా పెట్టుకుంటారు.

లక్ష్మీదేవి ఆవాసం 'లక్ష్మక్కపేట'

ప్రజాశక్తి-వలేటివారిపాలెం లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం

శిఖరంపై భాగంలో నిర్మించి ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని 'లక్ష్మక్కపేట'గా పేర్కొంటారు. లక్ష్మక్కపేట పేరు వింటే కొత్త ప్రాంతమనే భావన వస్తుంది. లక్ష్మక్కపేటకు వెళ్లామన్న పిలుపు వస్తే అదెంత దూరమోనన్న అనుమానం కలుగుతుంది. శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయం లక్ష్మక్కపేటకు దిగువన గుహాలయంలో నెలకొల్వారు. అయితే మహాలక్ష్మి ఆలయాన్ని కొండ శిఖరాన నెలకొల్పడం విశేషం. లక్ష్మక్కపేటకు సైతం ప్రాచీన చరిత్ర లేకపోలేదు. నరసింహస్వామి లక్ష్మీదేవి సమేతంగా మాలకొండ పర్యటించే కాలంలో ఒకరోజు వేటకు వెళ్లారట. అక్కడ ఓ చెంచుజాతికి చెందిన స్త్రీని వరించినట్లు కథనం. ఆ విషయం తెలిసిన లక్ష్మీదేవి కోపోద్రిక్తురాలై అలిగి వెళ్తుండగా ఆమె తోవకు ఓ బండరాయి అడ్డుగా తగిలిందట. కోపంతో ఆ బండరాయికేసి చూడగా ఆమె కోపాగ్నికి బండరాయి రెండుగా చీలినట్లు పురాణాల్లో పేర్కొన్నారు. చీలిన దారిగుండా మహాలక్ష్మి కొండ శిఖరంపైకి వెళ్లి కూర్చున్నదని పురాణగాథ. చీలిన బండ నడుమదారి ఎంత ఇరుకుగా ఉన్నప్పటికీ స్థూలకాయులు సైతం నడిచి వెళ్లేందుకు అనువుగా ఉంటుంది. స్వామివారిపై అలిగి కొండ శిఖరాన కూర్చున్న లక్ష్మీదేవిని బుజ్జగించేందుకు నరసింహుడు అక్కడకు చేరి ఆమెతో ఉండటానికి నిర్ణయించుకున్నాడు. దీనినే లక్ష్మక్కపేటగా పిలుస్తారు. నరసింహుడు 'చెంచు' వనితతో విరహకలాపాలు నెరిపిన నేపథ్యంలో ఆలయ జయంతి సందర్భంగా ప్రతిఏటా 'చెంచులక్ష్మి' నాటకాన్ని ప్రదర్శిస్తారు.

మాలకొండస్వామి దర్శన వేళలు ఇవే..

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజలు నిర్వహించనున్నారు. నృసింహ స్వామి ఆలయంలో ఉదయం 4 నుంచి 4.30 గంటల వరకు తిరుమంజనం, 4.30 నుంచి 5 గంటల వరకు పుష్పాలంకరణ, నివేదన, 5 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుంది. సహస్ర నామార్చనను నిర్వహిస్తారు. 5.30 నుంచి 12 గంటల వరకు అష్టోత్తర నామార్చన ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి హరికథా కాలక్షేపాన్ని కొండపై నిర్వహిస్తారు. 12 నుంచి 12.30 గంటల వరకు నివేదన. 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. 5.30 నుంచి 5.45

క్యూలో నిలుచున్న భక్తులు

వరకు దేవాలయ శుద్ధి కార్యక్రమం జరుగుతుంది. అనంతరం ఆలయ తలుపులు మూసివేస్తారు. లక్ష్మీదేవి ఆలయంలో ఉదయం 4.30 ను,చి 5 గంటల వరకు పుష్పాలంకరణ, నివేదన ఉంటుంది. 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కుంకుమార్చన, 12 నుంచి 12.30 గంటల వరకు నివేదన ఉంటుంది.అనంతరం సాయంత్రం వరకు యథావిధిగా భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తారు.



భక్తుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి! ప్రథమచికిత్సా' కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

ప్రతి శనివారం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంకు వేలాది మంది భక్తులు వస్తుంటారు. కొండ కింద నుంచి నడిచి వచ్చే భక్తులు, కొండపైకి వచ్చాక మహిళలు వారి వ్యక్తిగత ఇబ్బందులతో గతంలో సతమతమయ్యేవారు. ఈ ఇబ్బందులను గమనించిన దేవస్థానం 2019, మే నెలలో అప్పటి జయంతి సందర్భంగా కొండపై ప్రథమచికిత్సా కేంద్రం ఏర్పాటు చేశారు. ఒక ఆర్ఎంపి వైద్యుడిని నియమించారు. ఆయనకు జీతం దేవస్థానం చెల్లిస్తుంది. అయితే మందులు మాత్రం దాతల సహకారంతోనే ఏర్పాటు చేస్తున్నారు. సగటున శనివారం నాడు 250 మంది వరకు వివిధ సమస్యలతో బాధపడుతూ చూయిం చుకుం టున్నట్లు అక్కడ ఏర్పాటుచేసిన ఆర్ఎంపి వైద్యుడు చింతలపూడి ఏడుకొం డలు తెలిపారు. బిపి, షుగర్, మహిళల సమస్యలకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉంటాయి. క్యూలైనులో వేచి ఉండి కొన్ని సందర్భాల్లో కళ్లుతిరిగి పడిపోవడం వంటివి జరుగుతుంటాయి. వీరందరికి అవసరమైన మందులు అందించి ప్రాథమిక వైద్యం చేస్తుంటారు. ప్రతి వారం దాతలు అవసరమైన అన్ని రకాల మందులను ఉచితంగా అందిస్తుంటారు. నాణ్యతలో రాజీ పడకుండా అవసరమైన మందులు భక్తులకు ఇస్తున్నట్లు ఆయన వివరించారు. భక్తులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణలో పోలీస్ సేవలు భేష్..

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:

మండలంలోని మాలకొండ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో ప్రతి శనివారమూ ట్రాఫిక్ నియంత్రణలో వలేటివారిపాలెం పోలీసులు సేవలు ప్రశంసనీయమని వాహనదారులు భక్తులు కొనియాడుతున్నారు. ప్రతి శనివారమూ మాలకొండ లక్ష్మీ నృసింహ స్వామికి పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దర్శనానికి వస్తుంటారు. ఆ సమయంలో భక్తులతో మాలకొండ ప్రాంగణమంతా కిక్కిరిసిపోతుంది. అంతేకాకుండా వందలాది వాహనాలు వస్తుంటాయి. ఆ సమయంలో వలేటివారిపాలెం ఎస్ఐ బాల మహేంద్ర నాయక్ తన సిబ్బందితో కలిసి భక్తులకు

ఎస్ఐ బాల మహేంద్ర నాయక్

ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలో తొక్కిసిలాట జరగకుండా సిబ్బందిని ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నారు. ట్రాఫిక్ విషయంలో రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలతో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడే సర్దుబాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నారు. జయంతి సందర్భంగా కందుకూరు డిఎస్‌పి, గుడ్లూరు సిఐల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసు భద్రత చర్యలు చేపడుతున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు పోలీస్ సేవలు ప్రశంసనీయమని కొనియాడు తున్నారు.

పర్యాటక కేంద్రంగా 'మాలకొండ'

- 15-16 శతాబ్దాల కాలంలో నిర్మాణం
- 500 ఎకరాల పైనే ఆలయ భూములు
- 75 ఏళ్ల క్రితమే ప్రభుత్వ ఆధీనంలోకి..

15-16 శతాబ్దాల కాలంలో రెడ్డి రాజులు నిర్మించినట్లు పేర్కొన్నారు. మాలకొండ శ్రీ లక్ష్మీనసింహ స్వామి దేవస్థానం చరిత్ర ప్రాశస్త్యమైందే. సుమారు 500 ఎకరాల పైబడి ఉన్న ఈ దేవస్థానం. సుమారు 75 ఏళ్ల క్రితమే ప్రభుత్వ ఆధీనంలోకి చేరింది. సుదీర్ఘకాలం ఆలయ ట్రస్టీగా వ్యవహరించిన పవని శేషయ్య కుటుంబం ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు ఆధారాలున్నాయి. పర్వత పంక్తులన్నీ పూలమాల ఆకారంలో ఉండటంతో మాల కొండకు ఆ పేరు వచ్చింది. ప్రకృతి అందాలెన్నో మాల కొండ సొంతం.

.ప్రజాశక్తి-వలేటివారిపాలెం

1934 సంవత్సరంలో పవని శేషయ్య ట్రస్టుర్డు చైర్మన్ గా నియమితులయ్యారు. 2016 వరకు 12మంది చైర్మన్లుగా బాధ్యతలు నిర్వర్తించారు. అంచెలంచెలుగా దేవస్థానాన్ని అభివృద్ధి చేశారు. ఆదాయం నామమాత్రంగా ఉన్నప్పుడు దాతల సహకారంతో అభివృద్ధి చేసినట్లు స్థానికుల కథనం. ఆలయ చరిత్రకు సంబంధించి ఎవరు ఏ కాలంలో నిర్మించారు! ఇక్కడ చారిత్రకమైన అంశాలు.. తదితర వివ రాలు తెలుసుకునే ప్రయత్నం చేసిన వారికి నిరాశే మిగులుతుంది. అటువంటి స్పష్టమైన ఆధారాలు, శాసనాలు భద్రపరిచేందుకు అధికారులెవ్వరూ ప్రయ త్నించిన దాఖలాలులేవు. దేవస్థానం దేవాదాయ ధర్మాదాయ శాఖకు బదిలీ అయినప్పటి నుంచే దర్శ నానికి రుసుము వసూలు చేసే పద్ధతి మొదలైనట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎసితో సహా రెగ్యులర్ సిబ్బందితో పాటు, కాంట్రాక్ట్ సిబ్బంది, క్యాజు వల్ సిబ్బంది సుమారు వంద మంది వరకు పనిచేస్తున్నారు. వేద పండితులు కూడా సేవలందిస్తున్నారు. దేవస్థానానికి సంబం ధించి 122.43 ఎకరాల సాగు భూము లున్నాయి. కొంత భూమి ఆక్రమణలకు గురై నట్లు అధికారులు ధవీకరిస్తున్నారు. వ్యవ సాయ భూముల నుంచి వచ్చే ఆదాయం నామ మాత్రమే. హుండీ ఆదాయం, ఇతర సేవల నుంచి అందుతున్న ఆదాయం అపా రం. ప్రధానంగా వివిధ సేవల కోసం వేలం ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం దేవస్థానానికి లభిస్తుంది. ఆదాయానికి అనుగుణంగా అభివృద్ధి చేపట్టకపోవడం విచారకరం. దేవస్థానానికి లభించిన ఆదాయాన్ని వివిధ బ్యాంకుల్లో ఫిక్స్ డిపాజిట్లు చేస్తున్నట్లు సమాచారం. ఆంధ్రా బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, భారతీయ స్టేట్‌బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, కెనరాబ్యాంక్, ఇండియన్ బ్యాంక్లలో కోట్లాది రూపాయలు డిపాజిట్ చేశారు.

మాలకొండని దర్శించండి సర్వ అరిష్టాలను తొలగించుకోండి

ఉప ప్రధానార్చకులు మాగంటి గౌరీ శంకర్

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం చేసుకుంటే సర్వ అరిష్టాలు తొలగిపోతాయని ఆలయ ఉప ప్రధాన అర్చకులు మాగంటి గౌరీశంకర్ తెలిపారు ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఇక్కడ 7 శనివారాలు వరుసగా పూజ చేసినందువలన సర్వ అరిష్టాలు తొలగిపోతాయని మాలకొండ క్షేత్రం మీ పాపాలకు ముక్తిదాయమని. ఉద్యోగ ప్రాప్తిరస్తు వివాహాలతో పాటు అంతా మంచి జరుగుతుందన్నారు ఇక్కడకు చుట్టుపక్కల ప్రజల తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు వస్తూ ఉంటారు స్వామివారిపేర్లు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుంది వారంలో ఒక్క శనివారం (స్వాతి నక్షత్రం) రోజున మాత్రమే భక్తులకు దర్శన భాగ్యం ఉంటుంది మిగిలిన రోజుల్లో ఋషులతో గడుపుతాను అని స్వామివారి చెప్పినట్లు పురాణాల్లో పేర్కొన్నారని తెలిపారు ఉదయం సూర్యోదయం నుంచి సాయంత్రం సూర్యాస్తమయం అయ్యే వరకు మాత్రమే ప్రజలకు దర్శన భాగ్యం కలుగుతుంది ఇక్కడకు వచ్చేవారిలో ఎక్కువ మంది వివిధ బాధలతో వస్తుంటారని వారి బాధలను స్వామి వారు తీరుస్తుంటారు అనేది భక్తుల నమ్మకం మాలకొండలో అద్భుత దశ్యాలు చుట్టూ అడవి ప్రాంతం మధ్యలో కొండలు కొండపై అమ్మవారి ఆలయం వచ్చే భక్తులకు ఆహ్లాదకరంగా పరిసర ప్రాంతాలు ఉన్నాయి ఈ ప్రాంతం కందుకూరు టు పామూరు మార్గం మధ్యలో ప్రధాన రహదారి వెంటనే ఉంటుంది ఇక్కడికి వస్తే పకతి ఒడిలోకి ఉన్నట్లే అనిపిస్తుంది వారంలో ఒక శనివారం మాత్రమే స్వామివారి ఆలయం తీసి ఉంటుంది. మొత్తంగా ఇక్కడి పరిసరాలను పరిశీలిస్తే భక్తులకు కొంత ఆశ్చర్యమే కలుగుతుంది రహస్యంగా ఏర్పడిన కొండల మధ్య పెద్ద పెద్ద బండరాయిలు సైతం నిలిచి ఉంటాయి. వాటిలోనే ఆలయ నిర్మాణాలు చేపట్టారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి..

గట్టమనేని చెంచునాయుడు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కూనిపాళెం టిడిపి సీనియర్ నాయకులు గట్టమనేని చెంచునాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి శనివారమూ మాలకొండకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగు తుండడంతో

దానికి తగ్గట్టుగా భక్తులకు వసతులు తక్కువగా ఉన్నాయ న్నారు. కొండ కింద నుంచి భక్తులు వచ్చే మార్గం, కొండపైన లక్ష్మమ్మక్క పేట నుంచి తిరుగు మార్గంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని పాలకులు దీనిపై దృష్టిసారించాలని చెంచునాయుడు సూచించారు. దేవాలయం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి సాధిస్తే భక్తులు ముందు రోజు రాత్రి నుంచి ఇక్కడే ఉండి పరిసర ప్రాంతాలను వీక్షించ వచ్చని పేర్కొన్నారు. అదే విధంగా ఇటీవల కొండపైన భక్తులు సేద తీరేందుకు కొన్ని గాల్వెన్ షెడ్లు ఏర్పాటు చేయడంతో భక్తులకు కొంత ఉపశ మనంగా ఉందన్నారు. కొండపైన వాహనాల పార్కింగ్ స్థలాన్ని మరికొంత విస్తరించే అవకాశాలను పరిశీలించాలని ఆయన అధికారులకు సూచించారు.

మహీధర్ రెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:

కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి తనకు ఎన్ని పను లున్నా వీలు చూసుకొని ప్రతి శనివారం మాలకొండకు వచ్చి వెళు ్తంటారు. పలు సందర్భాలలో అత్యవసర సమావేశాలు ఉంటే రాలేకపోతుంటారు. మిగిలిన సందర్భంలో శనివారం వస్తే ఆయన ఇక్కడే ఎక్కువ సేవ గడిపేందుకు ఇష్టపడతారు. సాధారణ భక్తుడి మాదిరిగా సేవలందిస్తుంటారు. క్యూలైనులో వేచివున్న భక్తులను పంపించడం, అన్నదానం వద్ద భక్తులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను పరిశీలిస్తుంటారు. ఇక్కడకు వచ్చే భక్తులను పలుకరిస్తుంటారు. దేవస్థానానికి వచ్చి సేవ చేయాలని కూడా పలువురికి సూచిస్తుంటారు. ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని సైతం దాతలకు విజ్ఞప్తి చేస్తారు. ఎమ్మెల్యేను నిరంతరం పరిశీలించే ప్రజలు మాత్రమే ఆయనను 'ఎమ్మెల్యే' చూసి అనిఅనుకు ంటారు. ఇతర సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఎమ్మెల్యే అన్న విషయం తెలియకపోవడంతో సాధా రణ భక్తుల మాదిరిగానే చూస్తుంటారు. ఆయన కూడా హడావుడి చేయరు. ఆయన వెంట దేవస్థాన సిబ్బంది, పోలీసులు ఉంటున్నా వారిని కూడా వద్దని పంపిస్తారు. ఎవరి పని వారు చేయాలని సూచిస్తారు. తాను సాధారణ భక్తుడి మాదిరి గానే ఉంటానని

దేవస్థానంలో భక్తుల వసతులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

చెప్తారు. దేవా లయ ప్రాంగణం మొత్తం పర్యటిస్తారు. ఎక్కడైనా అపరిశు భ్రంగా ఉన్నా, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలిసినా వెంటనే ఆలయ అధికారులను అప్రమత్తం చేస్తారు. నిరంతర పరిశీలన వలన ఇక్కడ భక్తులు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి, వివిధ అభివద్ధి పనులకు దేవస్థాన అధికా రులతో ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తారు. వాటిని ఉన్నతాధి కారులకు పంపిన అనంతరం తన బాధ్యతగా పైస్థాయి అధికారులతో మాట్లాడి పనులు త్వరగా మంజూరయ్యేలా కషి చేస్తారు. మొత్తంగా ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అక్కడ చేస్తున్న సేవలను చూసి భక్తులు ఆశ్చర్యపోతుంటారు. ఓ ఎమ్మెల్యే స్థాయిలో ఎంతో బిజీగా ఉంటున్నా కూడా ఇలా సాధారణ భక్తుడిలా ఉండటం విశేషం

అభివృద్ధికి అవకాశం ఉంది..

కుంభాల క్రాంతి కుమార్

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి ఆలయం అభివృద్ధి చేసేందుకు ఇంకా అవకాశం దృష్టి ఉంది. కొండల మధ్యనే ఆలయం ఉన్నప్పటికీ, ఇప్పటికే ఏటా అభివృద్ధి పథంలో ఉంది. అయినా భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించొచ్చు. పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు ఇక్కడే ఉండి, పరిసర ప్రాంతాలను పరిశీలించి సేద తీరేందుకు అవకాశం లేక పోలేదు. కొండ కింద నుంచి భక్తులు నడిచి వెళ్లడం, తిరిగి వచ్చే మార్గం అపరిశుభ్రంగా ఉంటుంది. ఆయా ప్రాంతాల అభివృద్ధిపై అధికారులు సారించాల్సిన దృష్టి అవసరం ఉంది. మాలకొండ దేవస్థానంలో భక్తులకు ఉన్న సౌకర్యాలు, ఆలయ దిగువ భాగాన ఉన్న శివాలయం, అమ్మవారి ఆలయం కనిపించేలా పెద్ద పెద్ద బోర్డులు శాశ్వతంగా ఉండేలా ఏర్పాటు చేస్తే బాగుంటుందని వలేటివారి పాలెంకి చెందిన కుంభాల క్రాంతి కుమార్ తెలియజేశారు.

అభివృద్ధిని రాజకీయంగా చూడొద్దు..!

పారిశ్రామిక వేత్త కోటపాటి జనార్ధన్‌రావు

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయాలకు ముడిపెట్టొద్దని మాలకొండ స్వామి భక్తుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కోటపాటి జనార్ధన్‌రావు అభిప్రాయపడ్డారు. మాలకొండ స్వామి జయంతి వేడుకల సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. రాజకీయ పార్టీలకతీతంగా మంచిని మంచిగానే చెప్పాలని, మాలకొండ దేవస్థానంలో అది స్పష్టంగా అమలవుతుందని చెప్పారు. దేవస్థానంలో భక్తుల రద్దీకి అనుగుణంగా భక్తుల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కొండపైన శ్రీ లక్ష్మీ అమ్మవారి దర్శన అనంతరం కిందకు వచ్చే దారిలో పారిశుధ్యం సక్రమంగా లేదని, సిబ్బంది పర్యవేక్షణ అక్కడ మరింతగా ఉండాలన్నారు. కొండపైన , కొండ కింద కూడా దుకాణాల వేలం పాటలలో దేవస్థానం తరపునే అధికారులు సీలింగ్ పాటలు పెడితే బాగుంటుందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.



కోటపాటి జనార్ధన్‌రావు

పాటదారులైన ప్రయివేటు వ్యక్తులు వేలం పాటలను అధికంగా పాడినందు వల్ల సదరు వస్తువుల ధరను కూడా అధికంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం మరింత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని

నేడు లక్ష్మీ నృసింహ స్వామి జయంతోత్సవ వేడుకలు

మొదటి పేజీ తరువాయి

ప్రసాదం అందజేస్తామన్నారు. స్వామి దర్శనం కోసం క్యూ లైన్లలో వేచి ఉండే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భక్తుల రద్దీకి తోడు వేసవి కాలం కావడంతో మరిన్ని ఏర్పాట్లు చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. దీనిలో భాగంగానే కొండపైన భక్తులకు సౌకర్యంగా..వారు వేసవి తాకిడికి గురికాకుండా సేద తీరేలా వాహనాల పార్కింగ్ స్థలం నుంచి 100 రూపాయలు దర్శనం టికెట్ల కౌంటర్ వరకు గాల్వెన్ షెడ్లు నిర్మించినట్లు చెప్పారు. కొండపైన భక్తుల సౌకర్యార్థం మజ్జిగ ప్యాకెట్లు, శీతల పానీయాలను సిద్ధంగా ఉంచారు. ఉదయం నుండే భక్తులకు పులిహోర, దద్దోజనం, స్వీటు పంపిణీ చేస్తారు. అనంతరం ఉదయం 10.00 నుండి అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని స్వామివారి గర్భ దర్శనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు చెప్పారు. అయితే అవకాశాన్ని బట్టి సాయంత్రం 3.00 గంటల నుండి స్వామివారి గర్భ దర్శనం అవకాశాలను పరిశీలిస్తామని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది..!

మాలకొండ స్వామి జయంతోత్సవ వేడుకలలో భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంలో దాతల సహకారం మరువలేనిదని ఈఓ శ్రీనివాసరావు కొనియాడారు. జయంతోత్సవం ముందు రోజు శుక్రవారం రాత్రి లింగసముద్రం మండలం పెంట్రాల గ్రామస్తులు చంద్ర మల్లికార్జునరావు, రమేష్ తదితరులచే భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి కొండ కింద పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జయంతి రోజు కొండపైన స్వామివారి సన్నిధిలోని భక్తుల కోసం లింగసముద్రం మండలం చినపవని గ్రామస్తులు, రత్న ఇన్ఫ్రా స్ట్రక్చర్ అధినేత ముళ్ళపాటి మాల్యాద్రి లక్ష్మీనరసింహం - సరళ దంపతుల సహకారంతో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులందరికీ అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తుల కోసం చేపట్టే అన్నదానంలో కందుకూరు సురేష్ రెడ్డి చికెన్ సెంటర్ అధినేత సన్నారెడ్డి సురేష్ రెడ్డి, ఒగూరు శ్రీనివాసరావు లచే స్వీటు, హాటు కూడా భోజనంలో ఇవ్వనున్నట్లు తెలిపారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా అభివద్ధి పనులు..!

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మి నృసింహ స్వామి దర్శనం కోసం ప్రతి శనివారం వచ్చే భక్తులు పెరుగుతున్న నేపథ్యంలో దానికి

అనుగుణంగా దేవస్థానంలో పలు అభివద్ధి పనులుచేపడుతున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. రూ 5.20 లక్షలతో మూడు వేల అడుగుల మేర కొండపైకి వెళ్లే మెట్ల మార్గం నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అన్నదాన సత్ర భవనంలో ప్రస్తుతం 370 మంది కూర్చుని తినే అవకాశం ఉండగా దీనిని 500 మంది ఒకేసారి కూర్చుని తినేలా అన్నదాన సత్ర భవనంలో పనులు చేయనున్నట్లు చెప్పారు. రూ 2.70 కోట్లతో కొండ క్రింద నుండి సైడు రేలింగ్ నిర్మాణ పనులను పటిష్టంగా చేపడుతున్నట్లు చెప్పారు. రూ 5.50 లక్షల నిధులతో శ్రీ లక్ష్మీ అమ్మవారి ఆలయ పున: నిర్మాణ పనులకు సంబంధించిన అంచనాలను అధికారులకు పంపామని, మంజూరు ఉత్తర్వులు వచ్చిన వెంటనే టెండర్ల పిలిచి నిర్మాణ పనులను ప్రారంభించనునట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కొండపైన 3 విఐపి గదులను నిర్మి స్తున్నట్లు తెలిపారు.

భక్తుల సౌకర్యార్థం కొండ క్రింద ఇప్పటికే నసింహ భవనంలో 58 గదులు, మాల్యాద్రి భవనంలో మరో 12 గదులు సిద్ధంగా ఉన్నాయని ఈవో కే బి శ్రీనివాసరావు ప్రజాశక్తి కి వివరించారు.

నూతన ప్రభుత్వంలోనైనా

ట్రస్ట్ బోర్డు నియామకం జరిగేనా..?

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు నియామకం దాదాపుగా ఏడేళ్లుగా మరుగ నపడింది. గత ప్రభుత్వంలో కందు కూరు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి గత ఏడాది జయంతి సందర్భంలో ట్రస్ట్ బోర్డు నియామకం చేపడతామని చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదు. దీంతో ట్రస్ట్ బోర్డు లేక దేవస్థానం అభివృద్ధి కొంత నత్తనడకన ఉందని చెప్పాలి. ట్రస్ట్ బోర్డు నియామకం ఉంటే ఛైర్మన్, కమిటీ సభ్యులు దేవస్థానం అభివృద్ధికి ఎప్పటికప్పుడు తగు సూచనలు, సలహాలు ఇస్తూ అభివృద్ధికి ఇతోధి. కంగా సహకరిస్తుంటారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకం ప్రస్తావన లేదు. అయితే నియోజ కవర్గంలోని పలువురు ఆశావహులు, వైసిపి నాయకులు ట్రస్ట్ బోర్డు నియామకం జరిగితే తమకే ఛైర్మన్ అవకాశం వస్తుందని ఎదురు చూసినప్పటికీ వారి ఆశలు అడి ఆశలుగానే మిగిలాయి. మాలకొండ దేవస్థానం ఆదాయ వ్యయ వివరాలు బహిరంగ పరచకపోవడంతో కొంత నిధులు దుర్వినియోగం అవుతున్నా యన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అదే ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు ఉంటే దేవస్థానం అభివృద్ధి పూర్తి స్థాయిలో ముందుకు సాగుతుందని చెప్పవచ్చును.

కొండపైన అడ్డదిడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాలు

కొండపై ట్రాఫిక్ సమస్య ఇలా..

'మాలకొండ' విశిష్టత అమోఘం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుండి పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకుని కోర్కెలు కోరుకొని తిరిగి వెళుతుంటారు. వారానికి ఒక్క శనివారం మాత్రమే నరసింహస్వామి దర్శనం భక్తులకి దక్కుతుంది. ఒక్కరోజు స్వామివారి దర్శనం ఉంటుంది కాబట్టి తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు స్వామివారి కొండకు చేరుకుంటారు. శుక్రవారం రాత్రికి దూర ప్రాంతాల నుండి వచ్చే వారు మాలకొండకు చేరుకొని అక్కడ నిద్ర చేస్తుంటారు. శనివారం తెల్లవారుజాము నుండి స్వామివారి దర్శనానికి భక్తులు క్యూ కడతారు. భక్తులు సుదూర ప్రాంతాల నుండి వస్తూ ఉంటారు కాబట్టి వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు ఆలయ అధికారులు చేస్తుంటారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులందరికీ ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి రుచికరమైన భోజనాన్ని అందజేస్తూ భక్తుల అభిమానాన్ని చురగొన్నారు. ఉదయం 7 గంటల నుండి 10గంటల వరకు అల్పాహారంలో కేసరి, దద్దోజనం, పులిహోర పెడతారు. 10 గంటల నుండి సాయంత్రం భక్తులు వచ్చేంతవరకు అంటే ఐదు గంటల వరకు భక్తులకు భోజనం పెడుతుంటారు. ఎంతోదూరం నుండి వచ్చిన భక్తులు చాలామంది స్వామివారిని దర్శించుకుని స్వామివారి భోజనాన్ని తినేందుకు క్యూలో నిలబడి భోజనం చేసి వెళ్తుంటారు. స్వామివారి భోజనం చేసిన భక్తులు ఆహా ఎంత రుచిగా ఉంది ఏ దేవాలయం దగ్గర ఇంత రుచికరంగా భోజనం పెట్టడం చూడలేదని చెబుతుంటారు. ప్రతివారం ఒకే విధంగా భక్తులకు భోజనాన్ని రుచికరంగా చేస్తుంటారు.

మాలకొండకు పోటెత్తిన భక్తులు

దైవ దర్శనానికి క్యూ లైన్‌లో భక్తులు

అన్నదానానికి దాతలు విరాళాలు

మాలకొండలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో దాతలు విరాళాలు అందజేస్తుంటారు. అదేవిధంగా బియ్యం పప్పులు సామాన్లు ఇస్తుంటారు స్వామివారి అన్నదానానికి పెద్దఎత్తున భక్తులు నుంచి నగదు రూపంలో విరాళాలు అందజేస్తుంటారు. స్వామివారి అన్న దాన కార్యక్రమానికి వారం జరిగే ఖర్చు అంతా పూర్తిగా తామే భరిస్తామని కొందరు భక్తులు ముందుకు వస్తుంటారు వారి పేరు మీద వారి కుటుంబ సభ్యుల పేరు మీద ఒక శనివారం అన్నదానం చేస్తుంటారు. మాలకొండలో అన్న దానం చేయించేందుకు భక్తులు ముందుగానే వారి పేరును నమోదు చేయించుకుంటారు. స్వామివారి సన్నిదానంలో అన్న దానం చేయించేందుకు భక్తులు పోటీ పడుతుంటారు.

అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రుచికరంగా భోజనం

శనివారం జరిగే అన్నదాన కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. స్వామివారి భోజనం చేసేందుకు భక్తులు ఎంత సమయమైనా ఎదురుచూసి భోజనం చేసి నాకు వెళుతున్నారు. ఎంతో రుచికరంగా భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ భక్తులకు పెడుతున్నారు. నిత్యం అధికారుల పర్యవేక్షణతో ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, భోజనం తయారు చేసే దగ్గర ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. అంచెలంచెలుగా ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం భక్తుల్లో విపరీతమైన నమ్మకాన్ని కలిగించింది. స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు దాదాపుగా భోజనం చేయకుండా వెళ్లే పరిస్థితి లేదు అందరూ కూడా స్వామివారి భోజనాన్ని తినేందుకు వస్తుంటారు. ఉదయాన్నే స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు అల్పాహారం తీసుకుని వెళుతుంటారు. 10 గంటల నుండి ప్రారంభమయ్యే అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుంటుంది

సేవకులు చేసే పని ప్రశంసనీయం

అన్నదాన కార్యక్రమంలో పాల్గొని సేవ చేసేందుకు సేవకులు స్వచ్ఛందంగా మాలకొండకు వస్తున్నారు. సుమారు 50 నుంచి 70 మంది వరకు నిత్యం అన్నదాన కార్యక్రమంలో సేవ చేస్తూ భోజనాన్ని భక్తులకు వడ్డిస్తున్నారు. అన్నదాన కార్యక్రమంలో సేవ చేసేందుకు వివిధ ప్రాంతాల నుండి సేవకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

తలనీలాలు ఇచ్చి స్నానాలు చేస్తున్న భక్తులు

ఆభరణాలు శుభ్రం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహా స్వామి, లక్ష్మీ అమ్మవార్లకు సంబంధించిన వెండి, బంగారు ఆభరణాలను ఆలయ అర్చక బృందం శుభ్రం చేసింది. ప్రతి యేటా జయంతోత్సవం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల ముందు నుంచే ఆలయ అర్చక బృందం మొత్తం ఆలయానికి చేరుకుంటుంది. ఇక్కడే ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉంటూ ఆభరణాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమవుతారు.



స్వామివారి ఆభరణాలను శుభ్రం చేస్తున్న అర్చక స్వాములు

కొండకింద టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలి

– మాజీ సర్పంచ్ కూడల ఉమా భాస్కర్‌రావు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహాస్వామి కొండ కింది భాగంలో సాధారణ భక్తుల సౌకర్యార్థం టాయిలెట్‌ల నిర్మాణం చేపట్టాలని అయ్యవారిపల్లె గ్రామ మాజీ సర్పంచ్ కూడల ఉమా భాస్కర్‌రావు సూచించారు. ఆయన మాలకొండ జయంతోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలకొండ దేవస్థానం వద్ద రూములు తీసుకున్నవారికి మాత్రమే టాయిలెట్ల వసతి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సాధారణంగా వేలమంది భక్తులు మాలకొండకు వస్తుండడంతో వారు టాయిలెట్ల వసతి లేక సమీపంలోని పొదలలోకి వెళుతున్నారు. తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. దేవస్థానం అధికారులు పాలకులు స్పందించి కొండ కింది భాగంలో టాయిలెట్‌ల వసతి కల్పించాలని కోరుతున్నామన్నారు.

'మాలకొండ' అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

– జెడ్‌పిటిసి సభ్యులు ఇంటూరి భారతి హరిబాబు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహాస్వామి దేవస్థానం అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అభినందనీయమని వలేటివారిపాలెం మండల జెడ్‌పిటిసి సభ్యులు ఇంటూరి భారతి హరిబాబు పేర్కొన్నారు. ప్రతిశనివారం మాలకొండకు వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉండడంతో తదనుగుణంగా దేవస్థానం వద్ద పలు సౌకర్యాలు కల్పిస్తున్న తెలిపారు. మాలకొండకు వచ్చే భక్తులందరికీ అన్నదాన సత్రభవనంలో ఎంతో శుచి శుభ్రతతో వంటకాలు చేస్తున్నారని తెలిపారు. వంటలు వడ్డించేందుకు వలేటివారిపాలెం, కందుకూరు, లింగసముద్ర తదితర మండలాల నుంచి భక్తులు స్వచ్ఛందంగా మాలకొండకు విచ్చేసి స్వామి వారి సేవలో పాల్గొంటున్నట్లు తెలిపారు. మాలకొండ పూర్తిగా అటవీప్రాంతం కావడంతో భక్తులు కొండపై సేద తీరేందుకు అవసరమైన మరికొన్ని వసతులు కల్పించాల్సిన అవశ్యకతను పరిశీలిస్తున్నామన్నారు. ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెంచి కాలుష్యాన్ని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాలకొండపై తాగునీటి వసతి కొంత సమస్యాత్మకంగా ఉందని, దానిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మాలకొండ నుంచి 14 కిలోమీటర్ల సుదూర ప్రాంతానికి వెళ్లి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మాలకొండ దేవస్థానం సమస్యలన్నింటిపై కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డికి పూర్తి స్థాయి అవగాహన ఉందని, ప్రధాన సమస్యల పరిష్కార మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు బడేవారిపాలెం వైసిపి నాయకులు ఇంటూరి హరిబాబు పేర్కొన్నారు.

మాలకొండలో అద్భుత ప్రదేశాలు

చుట్టూ అటవీ ప్రాంతం... మధ్యలో కొండ.. ఆ కొండపై అమ్మవారి ఆలయం.. వచ్చే భక్తులకు ఎంతో ఆహ్లాదకరంగా పరిసర ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతం కందుకూరు - పామూరు మార్గం మధ్యలో ప్రధాన రహదారి వెంటే ఉంటుంది. ఇక్కడికి వస్తే ప్రకృతి ఒడిలోకి ఉన్నట్లే అనిపిస్తుంది. వారంలో ఒక్క శనివారం మాత్రమే స్వామి వారి ఆలయం తీసి ఉంటుంది. మొత్తంగా ఇక్కడి పరిసరాలను పరిశీలిస్తే భక్తులకు కొంత ఆశ్చర్యమే కలుగుతుంది. సహజసిద్ధంగా ఏర్పడిన కొండల మధ్య పెద్దపెద్ద బండరాళ్లు సైతం నిలిచి ఉంటాయి. వాటిలోనే ఆలయ నిర్మాణాలు చేపట్టారు. ఆ ప్రాంతంలోని కొన్ని ప్రత్యేకమైన దృశ్యాలు..



మాలకొండ ఓవర్ వ్యూ

మాలకొండపై వెలసిన అమ్మవారి ఆలయం, చుట్టూ అటవీ ప్రాంతం

కొండ కింద ఉన్న ముఖద్వారం

కొండ కింద ఏర్పాటు చేసి ఉన్న షాపులు

కొండపైకి ఉన్న మెట్ల మార్గం

పొంగళ్లు పెట్టుకుంటున్న భక్తులు

కొండపై ఉన్న ద్వారం

కొండల మధ్య ఉన్న కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు

కొండపై ఉన్న శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం

తీలనీలాలు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కొండపై ఉన్న శ్రీవారి శంఖు చక్రాలు

స్వాగత సుమాంజలులు
నెల్లూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాలు ప్రసిద్ధిగాంచిన
మాలకొండ శ్రీ మాల్యాద్రి
లక్ష్మీనృసింహస్వామి జయంతి
సందర్భంగా విచ్చేయుచున్న భక్తులకు,
అధికారులకు, ప్రజాప్రతినిధులకు, హృదయపూర్వక
స్వాగత సుమాంజలులు...
కుంభాల క్రాంతి కుమార్
వైసీపీ నాయకులు, వలేటివారిపాలెం - ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా.

జయంతోత్సవ శుభాకాంక్షలు
భక్తుల కోరికలు తీరుస్తూ.. హృదయ జనులకు కల్పతరువుగా....
ప్రకృతి రమణీయతతో ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులను
అలరిస్తున్న నవ నారసింహ క్షేత్రాలలో అరుదైన క్షేత్రంగా విరాజిల్లుతున్న
మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహ స్వామి జయంతి
ఉత్సవాలకు విచ్చేయు అశేష భక్త జనావళికి, దాతలకు, శ్రేయోభిలాషులకు,
స్వాగతం... సుస్వాగతం....
భగవంతుని సేవలో....
మాగంటి గౌరీశంకర్ ఉప ప్రధాన అర్చకులు
పవని రఘు రామారావు ముఖ్య అర్చకులు
పచ్చవ శివకృష్ణ అర్చకులు
రాయసం విజయసింహ అర్చకులు
వి.నరసింహాచార్యులు అర్చకులు
ఎన్.వి.ఎస్.శర్మ అర్చకులు
మధు మురళి వేద పండితులు
పప్పు శ్రీకాంత్ వేద పండితులు

జయంతోత్సవ శుభాకాంక్షలు
అయ్యవారిపల్లె గ్రామ పంచాయితీలో
సహజసిద్ధంగా కొండల నడుమ
కొలువై ఉన్న మాలకొండ
శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి జయంతి
సందర్భంగా విచ్చేయుచున్న అశేష ప్రజానీకానికి
హృదయపూర్వక స్వాగతం...
డేగా వెంకటేశ్వర్లు (బుజ్జి), సర్పంచ్
అయ్యవారిపల్లె గ్రామ పంచాయతీ, వలేటివారిపాలెం మండలం

స్వాగతాంజలులు...
ప్రఖ్యాతిగాంచిన నవ నారసింహులలో శ్రీ జ్వాలా నరసింహస్వామిగా పేరు గాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం
మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి వారి
జయంతోత్సవానికి విచ్చేయు భక్తులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు
హృదయపూర్వక స్వాగతం...
శ్రీ & శ్రీమతి ఇంటూరి భారతి- హరిబాబు
జడ్.పి.టి.సి. సభ్యులు
వై.సి.పి.నాయకులు
బడేవారిపాలెం వలేటివారిపాలెం(మం), నెల్లూరు జిల్లా

జయంతోత్సవ శుభాకాంక్షలతో...
పశ్చిమప్రాంత ప్రజల ఆరాధ్య దైవంగా
వెలుగొందుతున్న
మాలకొండ శ్రీ మాల్యాద్రి
లక్ష్మీ నృసింహస్వామి జయంతోత్సవానికి
విచ్చేయుచున్న భక్తులకు, స్వాగతం-సుస్వాగతం
శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి దివ్య ఆశీస్సులతో..
కందుకూరు నియోజకవర్గ ప్రజలందరూ..
సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని..
ప్రజల ఆదరాభిమానాలు నిత్యం మాపై ఉండాలని
ఆకాంక్షిస్తూ..
డాక్టర్ గుండవరపు వెంకటేష్, MBBS,M.D.,
General Medicine, SRM University, Chennai,
Diploma in Endocrirology & Diabetology
గుండవరపు నరసింహారావు
గుండవరపు వెంకటశివాజి
శారద నర్సింగ్ హోమ్
త్యాగరాజ గుడి పక్కన,
కందుకూరు, నెల్లూరు జిల్లా.
అధినేతలు
శ్రీ వెంకట శివాజీ షూ మార్ట్
హోల్ సేల్ అండ్ రిటైల్ షాప్
మున్సిపల్ ఆఫీస్ పక్కన. కందుకూరు